# కుక్క పిల్ల

(కథలోకి ఎలా దిగడవో తెలీక ఈ విధంగా దిగుతూన్నందుకు పాఠకులు క్షమించాలి.)

కుక్కతోక పట్టుకు గోదారి సాధించగలిగిన హీరో లెక్కడా లేరంటారా?! ఊరుకోండి సార్. మీరు చూణ్ణంత మాత్రాన ఎక్కడా లేరనకండి. ప్రకాష్‌గాణ్ణి మీకు తెలుసా? తెలిస్తే అలా అనరు మీరు. ఏదీ ఓ సిగరెట్టిలా పారేయండి. ప్రకాష్‌గాడి గురించి వివరంగా చెప్తాను..... థాంక్స్, కాని కొంచెం అగ్గి కూడా ఇవ్వండి..... అగ్గిపెట్టె మీదే! ఉంచుకోండి..... మరింక..

"ఫ్రీ ఎన్టర్‌ప్రయిజ్" అంటే మీకు తెలుసా? అంటే మరేం లేదు. శ్రమంతా ప్రజల్ది; సిరంతా ఎన్టర్‌ప్రయిజుగాళ్ళది– అదీ దానర్థం. ప్రజల కోసం అంటూ ఎన్టర్ ప్రయిజుండదనీ, ఎన్టర్‌ప్రయిజు కోసం ప్రజ లున్నారనీ వాళ్ళ అభిప్రాయం. అయితే– ప్రజలంటే ఎవరు?

ఎవరో చెప్పండి? ప్రజలంటే బోడ్రావుడూ, గెడ్డం సన్యాసీను; అంటే మీరూ నేనూ అన్నమాట. మరోలా చెప్పాలంటే; జేబులో డబ్బు లేసుకు వెళ్ళే వాళ్ళు ప్రజలు! అవి కొట్టేసి బాంకుల్లో దాచుకొనే వాళ్ళు ఎన్టర్‌ప్రయిజుగాళ్లు. బోధపడిందా? ఈ సిస్టమ్‌కి బ్రిటన్, అమెరికా, రష్యా— పుట్టినిల్లు, మెట్టినిల్లు, గిట్టినిల్లు— వరుసగా ఎరుగు నది.

మా ప్రకాష్‌గాడు ఫ్రీ ఎన్టర్‌ప్రయిజులో సాటిలేని మేటి మొనగాడు. ఏ వన్. అంటే నంబర్ వన్ అన్నమాట. "కాశిబాబు" వాడసలు పేరు. "పరకాష్ బాబు", "ప్రౌకాష్ బాబు" వాడి నామాన్త రాలు. గిరడు గిరీశం అయినట్టుగా కాశిబాబు ప్రకాష్ బాబయేడు.

గిరీశంగాణ్ణి మీకు బాగా తెలిసుండాలి. గిరీశం అంటే అసలు గిరీశం, "కన్యాశుల్కం"లో పెద్దమనిషి, వాడంత పాప్యులర్ ఫిగరు మన సాహిత్యరంగంలో మరోళ్ళేడు. ఒప్పుకుంటారా? ఎంచేత వాడి ఏకచ్ఛత్రాధిపత్యం ఇంత కాలం నించీ అలా చలామణీ అయిపోతూం దంటారు? చెప్పగల్రా? అందుగురించి నాదో చిన్న థీరీ ఉంది. వినండి చెప్తాను.

ఇంగ్లండూ, ఫ్రాన్సూ, మరేమో ఒచ్చి, అమెరికా, జర్మనీ వగైరా అన్ని దేశాలూ తిరిగి చూయిస్సి మెన్టల్‌గా ముదిరిపోయి, సినికలైపోయి చివరకి భారద్దేశానికి షిప్పులోంచి కొత్తగా దిగిన ఫక్తుబూర్జువా సరుకు గిరడనే గిరీశంగాడు. దిగిన కొత్తలో బేవా ర్సుగా రికామీగా ఉన్నాడు మరి. మరీ మారని కాలం కదా అప్పటి కింకా! వాడికింకా సరిగా కాలాన్లేదు. ఇప్పు డాస్తులూ గీస్తులూ సంపా దించుకు పూటుపడి బాగా వేళ్ళు తన్నేసి ఊడలు కూడా దించేసేడు. వాడి గోత్రీకులంతా ఇప్పుడు (నాయకుడేకవచనం, నాయకుళ్ళు—

బహువచనం) నాయకుళ్ళయిపోయి దేశాన్నేలేస్తూ ఉంటే వాడాపాటి సాహిత్య రంగాన్నేలేడా?! అద్వైతానికాది శంకరు లెలాటి వారో మన ప్రస్తుత ప్రభువుల సిద్ధాంతాలకి కన్యాశుల్కపు గిరీశంగా డలాటి వాడు. అందుకే— మీకు తెలుసో లేదో— వాళ్ళందరికీ వాడంటే కొంత ఇన్స్పైరేషను. చిన్న సాప్టు కార్నరు. గిరీశంగాడికీ అంతకుముందున్న ఫ్యూడల్ మనుషులకీ జరిగిన తగువే "కన్యాశుల్కం"లో పెద్ద తగువు, తెలిసిందా?

అయితే—

ఆ పాత వెధవలూ ఈ కొత్త వెధవా కూడా ఒక్కలాటి వెధవలేనని టెస్టు చేయిస్సి చూపెట్టేసింది మధురవాణి. అప్పుడారంభమయిన గిరీశంగా ద్రోజులు ఇంకా ఇప్పటికీ వెళ్తున్నాయి చూసుకోండి. మధురవాణికి మంచి రోజులింతవరకూ రాలేదు..... అవున్లెండి, దేనికైనా టైమ్ రావాల్లెండి. అందుకే అప్పట్లో ఆవిడకి ఏ సరైన దారీ చూపించలేకపోయేడు సౌజన్యారావు పంతులు.

పంతులు కూడా అట్టే పనికొచ్చే సరుక్కాదని అందుకే లిట్మస్ టెస్టు చేసేసి చూపెట్టేసింది మధురవాణి....పోన్లెండి....ఇంతకీ సౌజన్యారావెటువంటివాడని మీ ఊహ?.... నా అభిప్రాయం చెప్పమంటారా? అతను ఇప్పుడున్న మన పెద్ద పెద్ద నాయకుల్లాటి వాడు! మార్వాడీ ప్రెస్సుకి సోషలిస్టు సిద్ధాంతాలు బోధపర్చే వాళ్ళాటివాడు, డిపెండెంటుగా సృష్టించేవా ఇండిపెండెంటుగా సృష్టించేవా అని టకాయించి దేవుణ్ణే చలో నరకానికే చలో అనగలిగిన డాకూగాళ్ళకు గీతాసారం, విదురుని నీతులూ చెప్తే వాళ్ళంతా మహాత్మాగాంధీలైపోతారుటండీ, మీ వెర్రి కాని ?! వీప్మీద కుళ్లు విడిపోయేట్టు ముక్కుమీద గుద్దినా లొంగిరాని వెధవలు, నాలుగు చీవాట్లు పెడితే మంచికి మారిపోతారా? అలాటి ఘటాలు మంచి మాటలకి లొంగుతాయా?

"డామిట్! కథడ్డం తిరిగింది" అనేసుకుని అన్నీ దులిపేసుకుని మళ్ళీ యథాప్రకారం తయారు! అలాన్చెప్పి అలాటి వాళ్ళని కొట్టావద్దు, తిట్టావద్దు. కాని మాత్రం చెరో రెక్కా పట్టుకు పటకారుతో కోర్ట లీ సేస్తే..... అయామ్ సారీ! గాభరా పడకండి, గోవాలోకి, వయలెన్స్ లోకి, వర్గ పోరాటంలోకీ థియరీ ఆఫ్ స్లేట్లోకి దిగిపోల్లెండి. ''పానిక్'' అయిపోకండి, ప్లీజ్! .. వేచెప్పేది మరేం లేదు. మా ప్రకాష్గాడు అపర గిరీశంగాడు. అసలుకి సరైన నకలు. పోలిక లా రీతిగా ఉన్నందువల్ల ఇదంతా చెప్పవలసొచ్చింది.

ఆ రోజుల్లో గిరీశం ఎలా ఉండేవాడో కాని, మా వాద్రోజుల్లో మా ప్రకాష్గాడు మాత్రం రుడాల్ఫ్ వాలెంటినో మేనల్లుళ్లా ఉండేవాడు. ఇప్పటి తెలుగు హిందీ బైస్కోపు హీరోలెవరూ వాడికి చాలు. అలా ఒకటోరకం ఫిగరు వాడిది. పులిసి బలిసిన ఆబోతులా ఇప్పటికూడా ఎలా వుంటాడో, కావలిస్తే, వెళ్ళి చూడండి. అందుకే చెప్పేరు; విద్య లేనివాడు వింత పశువైతే కాసులున్నవాడు జాతి పశువు. తెలివి తేటలిక్కాదుస్మండీ! జిత్తులకి ''జాకాలే" కాని, తెలివి తేటలకి బిగ్ యాస్ మాత్రం కాదు మావాడు.

వాడికి పర్సనాలిటీ ఎలాటిదో, తెలివితేటలు కూడా అలాటివే, అద్భుతం! మాటల్చెప్పి దేశాన్నమ్మేగల్డు. బజారుకి బయల్దేరడంటే, మనిషి ఆ పైన బట్టలూ! అంతే! మరింక ఎక్సరం వేస్చూసినా వంటి మీదెక్కడా కాణీ కనిపించదు. ఖాళీ పర్సయినా పట్టుకోడు. కాని, బయల్దేరడంటే మాత్రం ఊరంతా జయించుకొచ్చేస్తాడు. సెలు మేన్టేన్ చెయ్యడంలో వాడు చేసినట్టు లార్డ్ కిచ్నర్ కూడా చెయ్యే లేడు, కాలిస్తే గోల్డ్ఫ్లేక్ తప్ప కాల్చడు. వెళ్తే "లూటీ"కి తప్ప వెళ్ళడు.....

అరె! "లూటీ" మీకు తెలీదూ ?! మెడ్రాస్ హాల్‌బజార్లో దాన్తో సమానమైన హోటేల్లేదు కదా! అదొట్టినే ఓ సారి వెళ్ళి చూడాలంటే మీకు రూపాయి చార్జి. హిట్లరూ ముసోలినీ చర్చిలూ, ముగ్గుర్నీ ఒకరుగా ముద్దచేయిస్సి రాజ్‌పుట్ మీసం తగిలించేసి చమ్లా చుట్టేస్తే ఎలా ఉంటుందో ఊహించగల్రా మీరు ? లూటీ హోటేలు గేటు కీపరలాగే ఉంటాడు. రూపాయి టిప్పు— అంటే బక్షీసు— ఇవ్వగలిగినవాణ్ణి తప్ప రెండో వాణ్ని లోపలికి రానివ్వడు వాడు. మీరు మళ్ళీ ఎంతో మంచి డ్రెస్సు వేసుకొని రాజా ఆఫ్ రాంనగర్లా వెళ్ళినా, పాత కారు కిందఉేడాది మోడలయినా సరే— తీసుకువెళ్ళి అందులోంచి దిగితే మాత్రం మీకు డోన్ట్టాక్ గెటౌటే! గేటు దగ్గిర్నించి కిచెన్ దాకా అంతా ఒకే మోస్తరు హైక్లాస్‌లెండి. లోపలకెళ్ళి క్రాకరీ చూస్తే, అదే తినేయాలనిపిస్తుంది. ప్రకాష్‌గాడు, కాఫీ అయినా సరే, అక్కడ తప్ప మరోచోట తాగడు.

మరింక హైక్లాస్ ఆటల్లో మా వాడు ఎక్స్‌పర్టనుకోండి. ఫర్ ఎగ్జాంపుల్; క్రికెట్లో వాణ్ణి మించిన చెయ్యి లేదు. అందులో బ్యూటీ ఏవిటంటే మా వాడెప్పుడూ క్రికెట్ మాత్రం ఆడు. మరైతే ఏం చేస్తాడయ్యా ? ప్రతి మేచికీ అతి బ్యూటిఫుల్‌గా అంపైరింగ్ చేస్తాడు. ఆట్లో ఆటంతా ప్లేయర్సిది. ఛీర్సన్నీ అంపైర్వి. పదిన్నరకల్లా ఫుల్‌అంపైర్ యూనిఫాంలో గ్రౌండ్‌లోకి దిగేడంటే మా వాడు మరింక పులే కదూ! డెసిషనిచ్చేడంటే టకా! మరి దానికి తిరుగు లేదు. రంజిత్‌సింక్కాదు. అమర్‌సింక్కాదు, సీ. కే. నాయుడుకాదు, ఎవరొచ్చినా సరే వాళ్ళకి ఎల్. బి. డబ్ల్యు. ఇచ్చేసి కాళ్ళు విరిచేసేదన్నమాటే! వాడంటే హేమాహేమీల గ్గజగజ. అప్పట్లో వాడు ది వెరీ టెర్రర్ ఆఫ్ మెడ్రాస్ క్రికెట్ అన్నమాట.

మా వాడెంతవరకూ చదివేడంటారా? బియ్యే పాసయేడను కోండి, పెద్ద పెద్ద చదువు లెవడిక్కావాల్సార్ ఈ రోజుల్లో!? పచ్చ యప్పాస్‌లో, బియ్యే, వాడూ చదివేడు, నేనూ చదివేను, వాట్ గుడ్ ఈజ్ దట్ టు మి? లోకమంతా మీకు రోజాల బాట పరుస్తూంటే, వెధవ పెద్ద చదువు, ఎందుకది మీకు? యు వాన్ట్ ఇట్? "నో" కద; థాంక్యూ! కావాలంటారేమోనని భయపడ్డాను. ఒక వేళావా లనుకుంటే మీకు చదువొస్తుందేమోగాని, మీరెంత గింజుకు చచ్చినా మీ బియ్యే డిగ్రీతో మీరు రోజాపువ్వులరోడ్డు వేయించుకోగలరా? దానికి నశీబుండాల్సార్! అంటే నూరుమంది న్నాశనం చెయ్యగలిగిన తాహతూ ధీమా ఉంటేనే మీకలాటి సుఖాలు దొరకాలి.

....రూడ్‌గా అన్నాననుకోండి, మర్యాదాగా చెప్పాలంటే మీకు లక్కుండాలి. ప్రకాష్‌గాడి కది కావలసినంత! కాణీ లేనప్పుడు వాడు కోటీశ్వరుడు. మదుపులేని వ్యాపారానికి వాణ్ణి చెప్పే మరోణ్ణి చెప్పుకోవాలి. మూడు కార్లూ నాలుగు మేడలూ, అయిదు కంపినీలు, ఆరు బాంక్ డైరెక్టర్ షిప్పులు బంగారగుడ్లు పెట్టే ఇల్లాలూ, ముగ్గురు మణిపూసల్లాటి పిల్లలూ, సర్వెంట్సు, సిరులూ, సంపదలూ అన్నీ అంతా ఉన్నప్పు డిప్పుడెలా ఎంత దర్జాగా బిర్లా బ్రదర్లా ఉన్నాడో, పూటకి టికాణా లేనప్పుడు వాడింతకంటె దర్జాగా లార్డుకర్జన్ బాబులా ఉండేవా డన్నమాట. అలాటి వాళ్ళనే సలకులూ సహజలకులూ అంటారు మనవాళ్ళు. జాతకం చూస్తే వాడికి శనిగాడూ రవిగాడూ కూడా ఉచ్ఛలో ఉన్నారుట. మరింక, చెయ్యి చూస్తే ఫేట్‌లైను మూన్‌లోంచి జూపిటర్లోకి తారాజువ్వలా ఎక్కిపోయింది. అలాటి ఫేట్‌లైనున్న వాళ్ళు తోకలు పట్టుకునే పైకిలేచి పోతారుట, అది ఫేటు కాదు, లక్కు; కర్మ కాదు, అదృష్టం.

వాటి మధ్య తేడా లేదంటారా ? అయితే, మా దూరపు చుట్టంగా డొకడున్నాడు. వాడి కేసు తీసుకు చూడండి. చూసి, అదంతా వాడు చేసుకున్న కర్మంటారో, మర్లేక, అదంతా వాడికొచ్చిన అదృష్టం అంటారో, మీరే చెప్పండి.

మా వాడు– అంటే ప్రకాష్‌గాడు కాదు– మా చుట్టంగాడు తెల్లవాట్టైంలో జూనియరింజనీరుగా సర్వీసులో కాలుపెట్టేడు. అలా నలిగి నలిగి వార్ టైంలో అసిస్టెంటింజనీరయేడు. ఆ తరవాత హి నెవ్వర్ లుక్డ్ బాక్ ! స్వరాజ్యం ఒచ్చేక ఎగ్జిక్యూటివయేడు. తరవాత చీఫ్ కూడా అయేడు. డిపార్టుమెంటు పబ్లిక్ వర్క్సు బాబూ! అంటే కల్పవృక్షం.

బ్రిటిష్‌వాడు హిందీలోంచి ఇంగ్లీషులోకి "లూట్" "లూటీ" అనే మాటల్ని లాక్కొని తన స్వంతం చేసేసుకున్నాట్ట. నెహ్రూగారు పాయింటౌట్ చేసేరు మన కా విషయాన్ని. అదొకటి, రెండోదేవిటంటే; మన తెలుగు పందికొక్కుని తీసుకుపోయి "బాండికూట్" అని పేరు కొంచెం మార్చుకొని ఇంగ్లీషు వాడు దాన్ని ముద్దుగా తనదిగా పెంచుకుంటున్నాడని మనకి ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ చూస్తే స్పష్టపడుతుంది. కావలిస్తే వెరిఫై చేసుకోండి.

లూటీ చేసేడం, పందికొక్కులా తినేడం– వాటికి కొత్త నగిషీలు చెక్కి కొత్త తొడుగులు తొడగడంలో ఇంగ్లీషు వాళ్ళు చాలా పేన్స్ తీసుకుని మన వాళ్ళకి కొత్త కొత్త శిల్పాలు మప్పేరనే విషయం చాలా నిశ్చితమైన విషయం. అది మీరు కాదన్లేరు.

ఏద్దారికితే దాన్ని ఎవడికీ దొరక్కుండా తినేడంలో తెల్ల గురువుల్ని మించిన నల్ల శిష్యుడు మా చుట్టంగాడు. తరిఫీదంతా బిఫోర్ స్వరాజ్జే పొందేళ్లేండి. ఆ తరవాత స్వరాజ్యం ఒచ్చేక ఏమైం

దంటే, పెత్తనాని కొచ్చిన ఎలకలన్నీ కొద్ది రోజుల్లోనే పందికొక్కు లయి కూర్చున్నాయి. దాన్తో పోటీల్లావయిపోయి, పందేలు వేసుకు తినేడం దాకా ఒచ్చేసింది వ్యవహారం.

"రాట్స్! దె కిల్డ్ ది కాట్స్ ఎన్డ్ ఫాట్ ది డాగ్స్!"— పద్యం మీ గ్యాపకం లేదూ? అదీ పరిస్థితి. దాన్తో "లంచాలో! అవినీతో, దోపిడివో!" అంటూ ప్రజల్లో గోల బయల్దేరిందంటే బయల్దేరదూ మరి! చెవులు కోసేస్తూంటే ఎంత మేకలైనా ఎంతకాలం సహించి వూరుకుంటాయి?

ఆ గోల విని, సకాలంలో ఏదో ఒహటి చెయ్యకపోతే, మరి మనకి మర్యాదా దక్కదన్చెప్పి కొన్ని పాలకప్పులులు కొంతాలో చించి, "ఆగండి వెధవాయిల్లారా! ఆగండి! ఇదుగో ఓ పెద్ద పంది కొక్కు! మీ శ్రేయస్సుకోరి, ఇదిగో, దీన్ని ఈ నిమిషంనుంచీ పన్లోంచి తీసేస్తున్నాం! కాబట్టి మీ కొచ్చిన భయం ఇంకేం లేదు. గోలాపి సుఖంగా బతకండి!" అంటూ కేకలు వేసేయి.

ఆ విధంగా మా చుట్టంగాడికి పని పోయింది. పాలకుం బాకోసం ఓ బ్రైబరీ కేసులో ఇరుక్కున్నాడు. వెంటనే సస్పెన్షను, ఆ తరవాత అరస్టు దాన్తరవాత బెయిలు, అనయేక ఛార్జిషీటు దాఖలూ, కేసు విచారణాను, అందులో వాడికి ఆర్నెల్లు శిక్ష. దాని మీద అప్పీలు, మళ్ళీ బెయిలు, మళ్ళీ ఆర్గుమెంట్సు, ఆఖరికి అప్పీల్లో శిక్ష ఖాయం. తరవాత రివిజను, మళ్ళీ బెయిలు, మళ్ళీ ఆర్గుమెంట్సు........ అలా సుప్రీం కోర్టుకి.... ఆఖరికి కింది కోర్టు శిక్షే ఖాయం! మా చుట్టంగాడికి దాన్తో ఆర్నెల్లు కలుగులో నివాసం.

లాయర్లూ వీళ్ళూ వాళ్ళూ అంతా కలిసి మా వాడి దగ్గిర్నించి ఓ లకారం దాకా చింతకాయల్దులిపేసినట్టు దులిపే సేర్లెండి. ఓ అర్రెటు

గాను! దానికేంగాని, మా వాడికి ఆ విధంగా నౌఖిరీ పోవడం, కొంత డబ్బు పోవడం, చివరికి జెయిలు కెళ్ళడం — ఇదంతా మా చుట్టం గాడి కర్మ కాపోతే ఇంకేవిఁటి చెప్పండి! కాని, గురువు గారూ! ఉద్యోగం చేసి గడించుకున్న దాంట్లో ఖర్చు వెచ్చాలన్నీ పోను మా చుట్టంగాడు మిగుల్చుకున్న దెంతో తెలుసా? పదహార్లక్షలు! మరి దాన్నేఁవంటారు? అదదృష్టవేఁ కదా?!

ప్రజల్నడిగితే దాన్నే దోపిడీ అంటారు.

మా చుట్టంగాణ్ణడుగుతే అదంతా హార్డ్‌వర్క్ అంటాడు.

అదీ నిజవేఁలెండి. బతకాలంటే పుల్లూ సింహాలూ పంది కొక్కులూ ఏవైనా సరే కష్టపడే బతకాలి. అయితే, వాటికీ మీకూ తేడా ఏఁవుంది? ఉంది లెండి. మనం కష్టపడి బతుకుతాం, బతకలేక పోతే ఛస్తాం. అవైతే మన మీద బతికేస్తాయే కాని ఒకంతట చావ్వు. నే చెప్పింది కరెక్టేనా?

ఇంతకీ చెప్పొచ్చేదేంటంటే, జెయిలు కొల్చేసొచ్చేక మా చుట్టం గాడు పెళ్లాన్నీ కూతుర్నీ వెంటబెట్టుకుని టెంపర్రీగా తలదాచుకొందికి మా వూరికి మకాం మార్చేసేడు. మార్చీ మార్చగానే వాడి కూతుర్ని చూసి నేను ఇష్టపడిపోయేను. అంటే, ప్రేమించేనన్న మాట.

తెలుగులో ఆ పిల్ల పేరు లీలావతీ మంగతాయారు. ఇంగ్లీషులో సింపులుగా "లిల్లీ". చూడ్డానికి మల్లె మందారాల మిక్స్చరు. ఆ పిల్ల న్నేను చాలా దూరంనించి ప్రేమించేను. అంటే ఆ పిల్ల మున్సిపల్ ఆఫీసు కెదురుగా కూర్చుంటే నేను టవున్‌హాల్ అవతల్నించీ, స్కాండల్ పాయింటు దగ్గర కూర్చుంటే, తీర్థపురాళ్ల దాటేకొంత దూరం నించీ, వాళ్ళింట్లో ఆ పిల్ల పడుకునుంటే నేన్నాగదిలో మేలు కూర్చునీ ప్రేమించేవాణ్ణన్న మాట. గొప్పవాళ్ళని ప్రేమించడం

గొప్పన్యాసెన్సు గురువుగారూ! అనుభవం మీ తెలుసు కున్నాను. అయితే, అప్పటికింకా అనుభవం చాలు కదా!

మీరిల్లిది విన్నారా? బైరన్ కాబోలు చెప్పేడు: ఆడ త్తనజీవితంలో ఒక్కసారి ప్రేమిస్తుందిట. అది ఫేలయి పోయేక, లేక అదయిపోయేక ఆవిడగారు ప్రేమించడాన్ని ప్రేమిస్తుందిట తప్ప మరి దేన్నీ ప్రేమించదట. మా చుట్టంగాడి కూతురు— లిల్లీ— అప్పటికప్పుడే ఓ యంగ్ ఐ. పీ. ఎస్. ఆఫీసర్ని ప్రేమించిందిట. వాడూ అదే చేసేట్ట. ఇద్దరికీ మేరేజయే లోపున లిల్లీ ఫాదర్ మీద క్రిమినల్ కేసొచ్చి పడింది. దాన్తో పోలీసువాడు వెనక్కి జంకేసి పిల్లకి మరి కనిపించడం మానేసేడు. అంటే క్వయట్ గా కిస్తా ఇచ్చేడన్నమాట. అంటే గురుడు గికురించేడన్నమాట.

అంచేత, వైజాగొచ్చిన కొత్తలో లిల్లీ చాలా గ్లూమీగా, సవితి కొడుక్కి చెయ్యి విరిగితే చిన్న రాణీగారున్నట్టు చాలా విచారంగా ఉంది. ఫాదరు జెయిలు కెళ్ళేడు. పిల్లకదో "సారో". పోలీసు ప్రియుడు గిల్టుకొట్టేడు. అమ్మాయి కదో పెద్ద "సారో", డబ్బుంది కాబట్టి సరిపోయింది కాని అలాటి "డబుల్ సారో"కి మరో మామూలు పిల్లయితే చచ్చిపోయుణ్ణు.

ఆడది "డీప్ సారో"లో ఉండగా వళపర్చుకోవడం కొంతలో కొంత సులభం అని నేనెక్కడో చదివేను. రిచర్డ్ ది థర్డ్ గాడి టెక్నిక్ అలాటిదేనని షేక్స్పియరు చెప్పేడనుకుంటాను. కాని మేష్టరుగారూ! దానికైనా లెవెల్ సరిపోతే కాని కుదరదండీ. అబ్బే, లాభం లేదు. గట్టుమీద కాలుమీద కాలేసుక్కూర్చున్న వాళ్ళకీ నూతిలో దేవుళ్ళాడుతూన్న వాళ్ళకీ ఎక్కడా లంగరందదు. వరదలో నే కొట్టుకుపోతూ బ్రిడ్జిమీద చక్కా ఉన్న వాళ్ళని నేనెంత ప్రేమిస్తే

మాత్రం ఏం ప్రయోజనం ఉంటుంది గనక! వాళ్ళలా కిందికి చూస్తూనే ఉంటారు. నేను పరత్తో పోతూనే ఉంటాను. లిల్లీ కేసులో అలానే అవుతుందేమోనని చాలా భయపడ్డాను. మనం ఎక్కడ? పనహార్లక్ష లెక్కడ? కొండ మీద కొత్త లైట్‌హవుసెక్కడ? గొడారిగోతుల్లో గుడ్డిబుడ్డి దీపం ఎక్కడ? మధ్యని చాలా దూరం. చాలా తేడా ఉంది కదా!

రాగా పోగా, లిల్లీతో మా చుట్టరికం చెప్పుకుందికన్నా ఆపర్చునిటీ లేకపోయింది. కాని నాకు హోప్ మాత్రం పోలేదు. మేష్టారూ, హోపేగదా మనకి ప్రాణం!

ఓ రోజు సాయంకాలం అలాగే మాంచి మేలకం హోప్‌తో బీచిని కూచున్నాను. లిల్లీ నన్ను రికగ్నయిజ్ చేసి నాడ్ చేసినట్టుగా ఊహించడానికి నాకు చిన్నవకాశం దొరికింది. దాన్తో మొన్నీ మధ్య ఆకాశంలో గగారిన్ పడ్డ మూడ్లో పడ్డాను. "ఓహో! ఘా గోళం బావుంది! దాన్చుట్టూ బ్లూరిబ్బను చాలా బావుంది!" అలా ఆ రోజున లిల్లీ చాలా బావుందనిపించింది నాకు.

ఆ వేళ్టి ఈవెనింగు కూడా మోస్ట్ బ్యూటిఫుల్ ఈవెనింగ్ లెండి. మెత్తటి ఇసకమీద నీరెండ బంగారం కుమ్మరించేసినట్టుగా ఉంది. సముద్రపు కెరటాలు వెర్రిగా సింహాల్లా విరుచుకు పడిపోకుండా చక్కటి కుందేటి పిల్లల్లా చిలిపి గెంతులు గెంతుతున్నాయి. క్లబ్బులో దండుముండలు ఇంగ్లీషులో మాటాడుకున్నట్టు కాకుండా, లైబ్రరీలో బీర్వాలవార ట్యూటర్ కుర్రాడితో ఆనర్సమ్మాయి మాటాడినట్టు ఆవేళ్టి గాలి చల్లగా మెల్లిగా మెత్తగా ఉంది. వాతావరణమంతా "ఈవెనింగ్ ఇన్ పారిస్"లా కమ్మగా ఉంది. జేబులో నా కప్పు డింకా నాలుగు సిగరెట్లున్నాయి. నిండుగా ఓ అగ్గిపెట్టుంది. నేనప్పుడు

పెర్లిబ్లీ హేపీగా ఉన్నాను. లిల్లీ నన్ను పాసయి కొద్ది దూరంలోనే స్కాండల్ పాయింట్ దగ్గిర కూర్చుంది. ఆ పిల్లవి కళ్ళు కాంటెం ప్లేట్ చేస్తూ అలా సుఖంగా కూర్చున్నాను. కవులు కళ్ళు చూసి ప్రేమించాలనీ, మిగతా వాళ్లు మిగతా వాటిన్చూసి లవ్ చెయ్యాలని అదేదో ఒక రూలుందిట. అప్పట్లో చెప్పేవారు. ఆ ప్రకారం అలా చూస్తూ కూర్చున్న నేను అప్పుడు టెంపరరీగా స్వర్గంలో ఉన్నాను.

మేష్టారూ! మీ రెప్పుడైనా సొరచేపన్చూసేరా? అడివిలో పెద్దపులి అలానే ఉంటుంది. ట్రెమెండస్ పర్సనాలిటీ! నేనోసారి చూసేను. పెద్ద పడవంతుంది. అరపై బాంక్ డైరెక్టర్ల పెట్టు! దెబ్బ తీసిందంటే తిరుగులేదు. చచ్చిన్దాన్ని బైటకి లాగడానికి పదిమంది కూలీలు చాలేరుకారు. గురువుగారూ! దాన్నావేళ కోస్తే దాని కడుపులో ఏం కనిపించేయనుకున్నారు?! ఓ పెన్నూ, ఓ బంగార్రిస్టువాచీ, రెండుంగరాలూనూ!! వాటి తాలూకు మనిషిది మాత్రం అయిపెక్కడా లేదు. గోళ్ళతో పళ్ళతోసహా జీర్ణం అయిపోయినట్టున్నాడు. ఫిషరీ డిపార్టుమెంటాఫీసరొహడు అదలా చూస్తూ మూర్ఛపోయేడు. చెప్తే ఇదంతా మీ కబద్ధం, నాకు నిజం........ సొ ర చే ప నే ఇంగ్లీషులో "షార్క్" అంటారు మేష్టారూ! అరె! మీరెప్పుడూ చూళ్ళేదా? పోనీండి. పెద్ద పెద్ద కంపెనీల ఫారిన్ దొరల్ని చూసేరా? అంతెం దుకు, నూనె కంపెనీ ఉందా? అందులో పెద్ద దొరన్చూస్తే షార్కుని మీరు వేరె చూడక్ఖర్లేదు. రస్సాకి రస్సావాడే అది, అదే వాడు.

అలాటి సొరచేప గుభీమని సముద్రంలోంచి ఎగిరొచ్చి పడ్డట్టుగా, ఆ సాయంకాలం బీచి రోడ్డుమీంచి ఇసకలోకి ఎగిరి దుమికేడు ప్రకాష్‌గాడు. ఎందుకో తెలుసా? పోటీకి!

బ్రాజెన్‌గా వాణ్ణాతో పోటీకి తగులుకున్నాడు!

మేష్టారూ! ఎంచేతో కాన్నాకు చిన్నప్పణ్ణించీ కూడా నగ్న సత్యం అంటే చాలా ఇష్టం. అప్పటికి వారం రోజుల కిందట ప్రకాష్ గాడితో చాలా తీవ్రంగా నేను కొన్ని నగ్నం మాటలు మాటాడేసేను.

ఒరే బ్రదరూ! నువ్వు నా ప్రేమ గిరిలోకి అక్రమంగా ప్రవేశించి దురాక్రమణ చెయ్యబోతున్నావూ, అత్తప్పొరే అన్చెప్పేను. నువ్వు ట్రెస్‌పాసర్వి కాబట్టి నిన్ను ప్రాసిక్యూట్ చెయ్యొచ్చునొరే అన్చెప్పేను. ఇలా చెయ్యడం నీ కిది భావ్యవాఁ, ఇదర్మవాఁ, ఇది నీకు తగునా అన్చెప్పి కేకలు వేసేను. నేను లవ్ చేస్తూన్న నా చుట్టప్పిల్లని నువ్వు— నా ప్రాణస్నేహితుడివయి కూడా— ఇలా అడ్డు ప్రేమ ప్రేమించడం ఇది జంతువైజం కాని మానవవైజం కాదని నిష్కర్షగా నిజం చెప్పేను. నువ్వు విశ్వాసఘాతకుడివి. విలన్వి, వింత పశువ్వి. అన్చెప్పి చాలా గట్టిగా తిట్టి మరీ చెప్పేను.

అంతా విని వాడు వికవిక నవ్వేడు. యూదుల్ని చంపినప్పుడు నాజీలిలాగే నవ్వేవారుట. నగర వీధుల్లో "శాంతి ప్రదర్శనలు" జరుపుతే న్యూయార్కు పోలీసు లలానే నవ్వుతారుట. "మిత్రలాభం" చదివ్వినిపిస్తే గుంటనక్కలన్నీ అదే మోస్తరు నవ్వు నవ్వుతాయిట.

కొంతసేపలా వికవిక నవ్వి, "ఇది ఫ్రీ సొసైటీరా బ్రదర్" అన్నాడు వాడు.

"స్టాటసూ గీటసూ అని కబుర్లు చెప్తావు కదా! మరి నీకు జెయిలు కెళ్ళిన వాడి కూతురెందుకురా, వెధవా!" అనడిగేన్నేను.

"పెళ్ళి చేసుకొందికిరా" అన్నాడు వాడు. అనేసి కుడిచేతి అయిదు వేళ్ళూ విప్పి చూపించి ఒకొక్కటీ ముడుస్తూ, "ఆ పిల్ల ఫాదరు జెయిలు కెళ్ళేడు కాని ఆ పిల్ల జెయిలు కెళ్ళలేదు. అదొకటి!

ఫాదరు జెయిలు కెళ్లేడు గాని వాడ్డబ్బు జెయిలు కెళ్ళలేదు. అది రెండు' జెయిలు కెళ్ళినందువల్ల వాడి విలువ తగ్గిందేమో గాని వాడి పసహార్లక్ష ట్రూపాయల ఖరీదు ఒడ్డీల్తో పెరుగుతోందే కాని దమ్మిడీ మేరకి తగ్గ లేదు. అది మూడు! తండ్రి కదొక్కర్తే కూతురు కాబట్టి దాన్ని పెళ్ళా డితే ఆ ఆస్తంతా నా కొచ్చి తీరాలి. అది నాలుగు! మోడ్రన్ సొసై టీలో స్టాటస్‌కీ సక్సెకీ ఆధారం డబ్బు డబ్బు డబ్బు, డబ్బే ఆధారం. అదయిదు!" అని కూడా చెప్పి ఆఖర్న పిడికిలి బిగించి, "జయం నాదే!" అంటూ చెయ్యెత్తి జే కొట్టుకున్నాడు ప్రకాష్‌గాడు.

ఇలా వాడికీ నాకూ సంభాషణ జరిగి — ఫ్యూడేస్ — కొద్ది రోజులే అయింది. వాణ్ణన్ను మెడ్డాయించేదామని విశ్వప్రయత్నం చేస్తూన్నా నేనెక్కడి కక్కడ అడ్డు వేసుకొస్తూ కాసుకొంటూనే ఉన్నాను. ఈ పరిస్థితిలో ఎంకరేజింగ్ ఫీచరేవిటంటే వాడెంత ఫోజుగా తిరిగినా మా లిల్లీ వాడివేపో అరచూపు కాదు పావు చూపైనా చూళ్లేదు. అది చూసుకుని నేను చాలా ధీమా పడిపోయేను. చాలా గర్వించేసేను.

కాని మేస్టారూ !

ఆ రోజు సాయంకాలంనించీ టేబిల్సు పొజిషన్సు మారిపోయి, తల్లకిందులైపోయి, షేపులు మారిపోయేయి.

అందుక్కారణం ?

మరేంలేదు. ఇసుకలోకి షార్కులా ఉరికిన ప్రకాష్‌గాడి కుడి చేతిలో మెరిసే ఇనపగొలుసుంది. గొలుసు చివర — గురువుగారూ ! చెప్తే నమ్మరు — మూడు పూట్లా లవండర్ స్నానాల్చేసేసి ముప్పొద్దులా చికెనూ, మటనూ తప్ప మరేం ముట్టని మేల్జాతి అల్సేషన్ కుక్కపిల్లొకటుంది!

ఇంద్రుడు వజ్రాయుధంతో దిగినట్టు కుక్కతో ఫీల్డులోకి దిగేడు వెధవ! పరిస్థితి మారిపోడానికి అదీ ప్రబల కారణం!

ఏం చెప్మంటారు ?!

నాలో పెద్ద లొసుగొకటుంది. నాకు పెంపుడు కుక్కలంటే పడదు. సరైన కారణం కాకపోవొచ్చు కాని, దానికో కారణం మాత్రం ఉంది. అప్పుణ్ణాకు ఆ కారణం స్పష్టంగా తెలిసేది కాదు. ఇప్పుడు అనలైజ్ చేసుకు చెప్తున్నాను.

పట్టుతివాసీ, పొడుగు బాలీసు, తాంబూలం, హుక్కా, చేతి కర్రా, పొగచుట్టా, పెంపుడు కుక్కా — ఇవన్నీ ప్యూడల్లక్షణాలని నా నమ్మకం. వాటిన్చూస్తే పాతకాలపు పెత్తందార్ల దుర్లక్షణాలన్నీ నాకు జ్ఞప్తికొస్తాయి. ప్రజల మీద బతికేసే వాళ్ళ లక్షణాలు మొత్తం చేసి ఏవీ నాకిష్టంలేదు. కలవాళ్లే పెద్ద జాతి కుక్కలు కలవాళ్లు, ఇప్పటికీకూడా నె చెప్పినవన్నీ ఎక్కువ వాళ్ళ స్టాటస్‌కి సింబల్సుగా అమల్లో ఉన్నాయి. కావలిస్తే చూసుకోండి.

కలవాళ్ళంటే ఉండే ద్వేషంవల్ల వాళ్ళ కుక్కలంటే కూడా నాకు ద్వేషం పుట్టుకొచ్చింది.... మరైతే డబ్బున్న లిల్లీని ఎలా ప్రేమించేనంటారా ? బాగా అడిగేరు సార్, బాగా అడిగేరు, వయసులో ఉన్నప్పుడు — గిరీశంగాళ్లకి తప్ప — మన్లాటి వాళ్లకి వనితే ప్రధానం కాని మరోటి కాదుకదా సార్ ! అయినా లిల్లీ ఫాదరు జెయిలు కెళ్లకపోతే దాన్ని లవ్ చేసేవాణ్ణే కానేమో ! అయినా నాది కూడా అదేరకం క్లాసు కదు సార్ ! ఇంకా పూర్తిగా మార్లేదు కదా మనం ! సోదరమానవులంటే, మనం ఇంకా సోదరులు మాత్రం మానవు లనుకునే స్టేజిలో ఉన్నాం. చూసేరా గురువుగారూ, నన్ను గొప్ప ఇరకాటంలో పెట్టేసేరు.....

మరింక చెప్పనీండి నన్ను, చెప్పేదేవిఁటంటే —

కుక్కలంటే నా కదో ప్రిజుడిసు. గిరీశంగాళ్ల కటువంటి ప్రిజుడిసు లుండవే! అబ్బే! లాభం కొట్టాలంటే వాళ్లు శిఖండినైనా చేపట్టేస్తారు. అది వాళ్లకి గొప్ప అడ్వాన్టేజ్ అంటారా? కాదుమరీ! ముమ్మాటికీ అడ్వాన్టేజే, ఎన్ని ఓట్లు ఒచ్చేయన్నదే లెక్కకాని ఎంత సారా ఖర్చయిందన్నది లెక్కకాదే.

గిరీశంగాడు— అయాంమ్ సారీ— ప్రకాష్‌గాడా సాయంకాలం తొడుక్కున్న సమ్మర్ ట్వీడ్ పంట్లాం చాలా బావుంది. వాడి బిన్నీ సిల్కు షర్టు ఎంతో బావుంది. వాడి బాటా బూట్లు నువ్వా నేనా అన్నట్టు చక్కా బావున్నాయి, ఒకటేఁవిఁటి సార్! వాడి జుట్టు, వాడి మీసం, వాడి నవ్వు, అన్నీ బావున్నాయి.

నాగుండెల్జారిపోయేయి. వాడు బావున్నందుకు కాదు (వాడెప్పుడూ బాగానే ఉన్నాడు.) వాడి కుక్క బావున్నందుకు. అది కుక్క కాదు. కుక్కపిల్ల. సైజుకి మాత్రం కుక్కంతుంది.

“ఎందుకురా నీకావెయ్యం?” అని చీదరించుకుని అడిగేను వాణ్ణి.

ఇనప గొలుసుని తటిల్లతలా ఆడించి మెరిపించి “ఇది ప్రేమ పాశంరా, బ్రదర్” అన్నాడు గిరీశంగాడు— అయాంమ్ సారీ ఎగన్—ప్రకాష్‌గాడు.

లిల్లీకి మనుషుల మీద కంటె కుక్కల మీదేఎక్కువ మక్కువ. అవతల, ఫాదరు జెయిలు కెళ్లిన తరవాతా, ఇవతల, పోలీసువాడు పెబ్బ తీసినతరవాతా, ఆ పిల్లకి మానవులంటే ఉన్న మక్కువ మైనస్

డిగ్రీల్లో ఉంది. తదనుగుణ్యంగా కుక్కజాతి మీద ప్రీతి పేట్రేగి పెరిగిపోయింది, మరి నా గుండెలందుకే జారిపోయేయి.

తాయారమ్మకి — లిల్లీకి — కుక్కలంటే ఉన్న వెర్రిప్రేమని వీలుగా తీసుకొని ఆ పిల్లభిమానం సంపాదించడానికి ప్రకాశంగాడు ప్లాటు వేసేడన్నది మీదపడి కరవొచ్చినట్టుగా స్పష్టంగా తెలుస్తోంది.

ఎంత నీచానికి దిగిపోయేడో చూసుకోండి!

అయితే అలాగన్చెప్పి మనం క్కూడా ఆ లెవెల్‌కి దిగిపోగలవా? దిగిపోయి అలాటి ప్లాటు లేద్దామనుకున్నప్పటికీ నా కలాటి హైక్లాస్ కుక్కల్దొరుకుతాయా? మీరే చెప్పండి, వాడంటే ఏ పౌగా క్కంపెనీ మేనేజరో, ఏ కుమారరాజా ఆఫ్ వ్రజపూర్‌గారి పర్సనల్ సెక్రెట్రీకో కాకాకొట్టి ఫస్ట్‌క్లాస్ కుక్కపిల్లని సంపాదించేడు. మైల్ రేస్‌లో నా మీద అరమైల్ లీడ్ కొట్టేసేడు. లిల్లీని తన్నుకుపోయేడు!

అవున్సార్! తన్నుకుపోయేడు. వాడిదే పదహార్లక్షల ప్రయిజు కప్పు! "టామీ" రాగానే డ్రామా ప్లాటు మారిపోయింది. హీరో విలన్లు తారుమారై పోయేరు. ఇసకలో కూర్చున్న పిల్లని వైరు వర్కుతో లాగేసినట్టు లాగేసేడు వాడు. ఒక వారం, రెండు వారాలు, మూడు వారాలు; వీరి వారి కుక్కలు విన్యాసాల ద్వారా తొలి పలకరింపులు, తరువాత ఇంటికి పిలుపులు, ఆ తరవాత మనసుల మార్పులు, అంతా చకచకా సాగిపోయింది. క్విక్ యాక్షన్‌కి అనుకున్న క్లైమాక్సు.

[3]

నలుడికి హంసలా మావాడికి కుక్కపిల్ల కుదిరింది.... అనా లజీ కరక్ట్ కాదంటారా ? పోన్లెండి. మీక్కావలసిందేదో మీరే చెప్పు కోండి....

"టామీ" అంటే ఎవరంటారా ? బావుంది సార్! అంతా విని ఆఖరికిదా ప్రశ్న ?! ప్రకాష్‌గాడు తెచ్చుకున్న అల్సేషన్ కుక్క పేరది. మన పెద్ద పెద్దలంతా తమ తమ కుక్కలకి తరచు ఇంగ్లీషు పేర్లే ఎందుకు పెడతారో మీకు తెలుసా ? నాకూ తెలీదు. ఎవరైనా రిసెర్చి చేస్తేబావుణ్ణు. చాలా యూనివర్సిటీలున్నాయంటారా? అవున్లెండి. ఎక్కడో అక్కడ ఎవడో ఒహడు చెయ్యకపోడు. చేసి, వాడు ప్రొఫెసర్ పోస్టు కొట్టకాపోడు. అదలా ఒదిలేయండి.

లిల్లీకి కుక్కలమీదుండే అభిమానాన్ని ప్రకాష్‌గాడేవిధంగా తనయందు మోహంగా మార్చుకున్నాడో, ఎన్ని లబ్జులు కొట్టేడో, ఎన్ని గిరీశోపాయాలు పన్నేడో అంతా వివరంగా చెప్తే అదంతా ఓ పెద్ద ప్రబంధం అంత అవుతుంది. అదంతా నన్నిప్పుడు వివరంగా చెప్మంటే, అయామ్ సారీ, నేనిప్పుడు చెప్పలేను. ప్రబంధంలో ఆఖరాశ్వాసంలో ముఖ్య విషయం ఏ(మి(టంటే మాత్రం: లిల్లీని వాడు పెళ్ళాడ్డం కాదు. అదెలానూ ఆడేసేడు. ఆ తరవాత ఆ పిల్లాస్తంతా— పదహార్లక్షలు గురువుగారూ ! కాణీ పరకా కాదు— ఆ పిల్లాస్తంతా వాడు వశపర్చుకున్నాడు. అదీ ఆఖరి ఛాప్టర్లో ముఖ్య విషయం. ఆ తరవాత అప్పణ్ణించిప్పటిదాకా ఆ డబ్బుని పెంచుకుని, ఆ పెళ్ళాన్ని ఏలుకుని వాడు సుఖంగా జీవిస్తున్నాడు.

ఇంతటితో వారి కథ మీరు సాంతంగా విన్నారు కాబట్టి:

సర్వే జనాస్సుఖినో భవన్తు ! ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః!

ఇంతకీ మేష్టారూ! అరె! వెళ్ళిపోతున్నారేం? కూర్చోండి సార్! చిన్న సంగతి కూచోండి చెప్తాను. మా ప్రకాష్‌గాడు మొద టెలిజబెత్ రాణి మొగుళ్ళా—ఆవిడకి పెళ్ళే కాలేదంటారా? అయుంటే, మొగుడుండుంటే— ఆవిడ మొగుళ్లా హాయిగా దర్జాగా ఉన్నాడు. లిల్లీ ముగ్గురు పిల్లల తల్లయినా వాడిపోకుండా ప్లాస్టిక్ పువ్వులా చూడ ముచ్చటగా చాలా సుఖంగా చాలా బావుంది. కానయితే, ఆ కుక్క పిల్ల ఆఖరి కేమయిందని అడక్కుండా అలా వెళ్ళిపోవడం ధర్మవా? గురువుగారూ?! ఏమయిందో చెప్తాను కూచోండి. వినండి.

ఆఖరికా కుక్కపిల్ల పెరిగి పెద్దదయింది. రోజులు కొన్నాళ్ళు బాగానే వెళ్ళేయి. కాని ఎల్లకాలం ఒక్కలా ఉండదు కదా! అందు లోనూ ఇట్ ఈజ్ ఎ డాగ్స్ లైఫ్. అంచేత అదలా పెరిగి పెద్దదయి, చివరకి గుడ్డిదయింది.

అంత సేవ నాకే చేస్తే ఆ కుక్కపిల్లన్నేను కంటి పాపలా కాపాడుకొని దానికో కంచువిగ్రహం కట్టించనూ? కాని, ప్రకాష్‌గాడు అన్ కాన్షస్‌గా, బుద్ధిపూర్వకంగా కాదు, అలా కాకుండానే దాని గురించి మర్చిపోయేడు. ఇడ్లీ తినేసేక ప్లేటెడంగా తోసేస్తాం కదా! అంతే! అలాగే జరిగింది.

అప్పుడో సెంటిమెంటల్ వంటవాడు దాన్ని చేరదీస్తే అక్కడ తన కడకాలబ్బతుక దెలాగో కడతేర్చుకుంది.

అదీ సంగతి కాని, సార్! మీరు అబ్జర్వ్ చేసేరో లేదో కాని నిజమైన సెంటిమెన్టంతా అలాటివాళ్ళకే ఉంటుంది సార్! సినిమా తీసుకోండి. తెరమీద్దంతా దొంగ ప్రేమేకదా, అంటే అంతా నటనే కదా. అయితే ఆ బొమ్మల్చూసి కరిగిపోయి నిజంగా ప్రేమించేసుకొనే వాళ్ళు నేలక్లాసు వాళ్ళేననే సంగతి మీకు తెలుసా? నేల క్లాసువాళ్లందే....

పాపం.... అరె ! వెళ్ళిపోకండి సార్ ! నేలవాళ్ళ గురించి సెంటి మెంటలైజ్ చెయ్యాల్లెండి.

మేష్టారూ, మేష్టారూ ! కూర్చోరూ ? అయితే కైన్డ్లీట సిగరెట్టిచ్చేసి వెళ్ళిపోండి. ప్లీజ్........ థాంక్స్! మీ పర్మిషన్తో రెండు తీసుకున్నాను. మరోలా అనుకోకండి. కొంచెం అగ్గి కూడా ఇప్పించండి... అన్నట్టు ! అగ్గిపుల్ల గురించో కథుంది సార్, విన్రూ? పోల్లెండి రాసి చూపిస్తాను; ఎలా ఉందో చెబ్దురుగాని.... అచ్ఛా దెన్ ! వెళ్ళండి. నేనుంటాను. సొలాంగ్! బై బై !